నవతెలంగాణ
నమ్మకైన తెలుగు దినపత్రిక
1
మెదక్
శనివారం | 30 మార్చి 2024 | www.navatelangana.com

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మల జగ్గారెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీజీఐఐసీ చైర్మెన్, డీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి.. వారి తనయుడు భరత్ సాయిరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-సిద్దిపేట



బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ దేవాలయంలో విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆశీర్వచనమిచ్చి, ప్రసాదాలు అందించారు.



## దీపాదాస్ మున్షీతో నీలం భేటీ

- గెలిచి రావాలని సూచన
- మెదక్ సీటును సోనియా గాంధీకి బహుమతిగా ఇస్తాం
- నీలం మధు ముదిరాజ్

నవతెలంగాణ-పటాన్‌చెరు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షితో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ లాంటి మహోన్నత నేత ప్రాతినిథ్యం వహించిన మెదక్ పార్లమెంట్ స్థానాన్ని తనకు కేటాయించడం పట్ల కాంగ్రెస్ అధిష్టానానికి రుణపడి ఉంటానన్నారు. తనకు టికెట్ రావడంలో సహకరించిన దీపాదాస్ మున్షికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో మెదక్ పార్లమెంట్ టికెట్‌ను కేటాయించిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ రాహుల్ గాంధీలకు మెదక్ సీటును గెలిచి కానుకగా అందిస్తామన్నారు. అందరి సహకారంతో మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల నేతలను కలుపుకొని అందరి సహాయ సహకారాలతో మెదక్ సీటును గెలుస్తాం అని ధీమా వ్యక్తం చేశారు.




## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ

నవతెలంగాణ-మద్దూరు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యను అందిస్తున్నారని ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ అన్నారు. ఈ సందర్భంగా మద్దూరు మండలంలోని లద్నూరు, గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి.ఎస్సై ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉపాధ్యాయులు అందిస్తున్నారని. విద్యార్థుల తల్లిదండ్రులు ఇది గమనించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలని ఆయన కోరారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివే ఈ స్థాయికి వచ్చానని ఆయన తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులను. తల్లిదండ్రులను గౌరవించాలని ఆయన కోరారు. అంతకు ముందు వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు జీడి కంటి సుదర్శన్, రామడుగు బాలరాజు, ఎంఈఓ మొగుళ్ల నరసింహారెడ్డి, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరే లక్ష్మీనరసయ్య, విద్యావేత్త పి రామ్మూర్తి, ఎస్ఎంసి చైర్మన్ శారద, మాజీ ఎస్ఎంసి చైర్మన్ అన్నోజు భాస్కర్, ఉపాధ్యాయులు, హరి ప్రసాద్, విష్ణుమూర్తి, ఉపేందర్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రై డే వేడుకలు

- ప్రత్యేక ప్రార్థనలతో మారుమ్రోగిన చర్చీలు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని అయా గ్రామాల్లోని చర్చీల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రై డే వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని సీయోను ఏవాంజీకల్ చర్చి యందు పాస్టర్ ఓరుగంటి విక్కి సహోదరి మిరియం అధ్వర్యంలో ఏర్పాటుచేసిన గుడ్ ఫ్రై డే వేడుకలకు రాష్ట్ర ఆహార భద్రత మండలి సభ్యుడు ఓరుగంటి ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యేసు క్రీస్తు జననమే గొప్ప చరిత్రను అవిష్కరించిందన్నారు.తన కోసం కాకుండ ప్రపంచ శాంతి,సత్ప్రవర్తనమైన మానవాళి జీవనం కోసం యేసు క్రీస్తు బోధనలు చేశారన్నారు. ప్రజలు చేసిన పాపాల కోసం ఎన్నో శ్రమలు అనుభవించారని..చివరకు ప్రజల కోరకు ముళ్ల కిరీటం దరించి,శిలవను మోసి మరణించి మూడవ రోజున సజీవుడై తిరిగి లేచిన మహనీయుడు యేసు క్రీస్తుయేనన్నారు.ప్రజలు యేసుక్రీస్తు జీవనాన్ని స్పూర్తిగా తీసుకుని మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. మండలంలోని అయా గ్రామాల్లోని చర్చీలు క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలతో మారుమ్రోగాయి.



## మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెన్న రాజు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెన్న రాజును శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ నియమించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ జాతి ఐక్యత కోసం అహర్నిశలు కృషి చేసిన వెన్న రాజును జిల్లా అధ్యక్షుడి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. దళిత గిరిజన బహుజనుల అభి వృద్ధి కోసం మరింత పాటు పడతానని వెన్న రాజు అన్నారు.

**వెన్న రాజును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెన్న రాజును మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియమించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షిస్తూ శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, పోలు సంపత్, బిఖ్యానాయక్, బందారపు శ్రీనివాస్, గుగులోతు రాజు నాయక్, పోతారం శ్రీనివాస్ లింగాల యాదగిరి రాజు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురూ ఉద్దండులే..

- ఇద్దరు మాజీ ఎంపీలు.. ఒకరికి ఎంపీగా పోటీ చేసిన అనుభవం
- 2007 నియోజకవర్గాల పునర్‌వ్యవస్థీకరణలో...
- ఏర్పడ్డ జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం
- 2009లో తొలి సారి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం
- 2014, 2019 ఎన్నికల్లో గులాబీ పార్టీ గెలుపు
- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 13.1 శాతం ఓట్లే
- జహీరాబాద్‌లో 1635999 మంది ఓటర్లు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జహీరాబాద్ లోక్ సభ నియోజకవర్గం 2007లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పడింది. అంతకు ముందు నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న 4 అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడింది. దీని పరిధిలో జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ ఏడు అసెంబ్లీ నియోకజవర్గలున్నాయి. లోక్‌సభ నియోజకవర్గంలో 16.35 లక్షల మంది ఓటర్లున్నారు. సామాజిక పరిస్థితిని పరిశీలిస్తే దళితులు 17.8 శాతం, ఎంటీలు 8.4 శాతం, క్రిస్టియన్లు 0.49, ముస్లీం లు 11.9 శాతం ఉన్నారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి మూడు సార్లు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా 2014, 2019 ఎన్నికల్లో గులాబీ పార్టీ గెలుపొందింది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీమూడు పార్టీలు పోటీ పడుతున్నాయి.

**రెండు సార్లు బీఆర్ఎస్...ఒక సారి కాంగ్రెస్ గెలుపు**

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత మూడు సార్లు ఎన్నికలు జరిగాయి. నాల్గో సారి ఎన్నికలు జరగబోతున్నాయి. 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సురేష్ షేట్కర్‌కుమార్ 395767 ఓట్లు సాధించి ఎంపీగా గెలుపొందారు. టీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన యూసూఫ్ అలీ 378360 ఓట్లు సాధించి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేయలేదు. చిరంజీవి పెట్టిన పీఆర్పీ అభ్యర్థిగా మల్కాపురం శివకుమార్ పోటీ చేయగా ఆయనకు 1,12792 ఓట్లు పోలయ్యాయి. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సురేష్ షేట్కర్ రెండో సారి పోటీ చేశారు. ఆయనకు 304030 ఓట్లు వచ్చాయి. టీఆర్ఎస్ నుంచి వ్యాపార వేత్త బీబీ పాటిల్ పోటీ చేయగా ఆయనకు 508661 ఓట్లు రావడంతో కాంగ్రెస్‌పై 144631 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి మదన్‌మోహన్‌కు 157497 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లోనూ బీజేపీ పోటీ చేయలేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్‌రావు పోటీ చేయగా ఆనయకు 428015 ఓట్లు పోలయ్యాయి. టీఆర్ఎస్ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ బీ బీ పాటిల్‌కు 434244 ఓట్లు రావడంతో 6229 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి బాణాల లక్ష్మారెడ్డికి కేవలం 138947 ఓట్లు మాత్రమే వచ్చాయి. జాతీయ పార్టీగ పోటీ చేసిన బీజేపీ కేవలం 13.30 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి.


**2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 13.1 శాతం ఓట్లే**

2023లో జరిగిన రాష్ట్ర శాసన సభా ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే... అత్యధికంగా కాంగ్రెస్ పార్టీకి 41.7 శాతం ఓట్లు వచ్చాయి. నాలుగు చోట్ల ఎమ్మెల్యేలు గెల్వగా మూడు చోట్ల ఓటమి పాలయ్యారు. కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి ఓడిపోయారు. బీఆర్ఎస్ ఏడుగురు అభ్యర్థులకు 40.2 శాతం ఓట్లు వచ్చాయి. రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారు. ఏడు స్థానాల్లో పోటీ చేసిన బీజేపీకి మాత్రం 13.1 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను జహీరాబాద్, బాన్సువాడలో బీఆర్ఎస్, అందోల్, నారాయణఖేడ్, జుక్కల్, ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందగా కామారెడ్డిలో మాత్రం బీజేపీ ఎమ్మెల్యే గెలిచారు.

**ట్రయాంగిల్ పోటీ..**

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మూడు ప్రధాన పార్టీల మధ్య ట్రయాంగిల్ పోటీ జరగనుంది. ముగ్గురు అభ్యర్థులు కూడా ఉద్దండులే అయినప్పటికీ పార్టీల పరంగా చూస్తే బీజేపీకి సంస్థాగత పట్టు, ఓటర్లు గెలిచేందుకు సరిపడ లేదు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న బీబీ పాటిల్ నియోజకవర్గమంతటా పరిచయస్తుడుగా ఉన్నారు. రెండు సార్లు ఎంపీ పనిచేశారు. అయితే ఆయన నియోజకవర్గంలో చెప్పుకోదగిన అభివృద్ధి అంటూ ఏం చేయలేదనే అభిప్రాయముంది. పైగా బీజేపీకి సంస్థాగతంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీస ఓట్లు కూడా లేవు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి షేట్కర్ కూడా గతంలో ఎంపీగా పనిచేశారు. రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గెలిచారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ నియోజకవర్గానికి కొత్తవారు కావడం వల్ల స్థానిక నాయకులు, ఎమ్మెల్యేలే బలంగా నమ్ముకున్నారు.

| జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం | |
|---|---|
| జహీరాబాద్ | 274198 |
| నారాయణఖేడ్ | 286377 |
| అందోల్ | 250086 |
| కామారెడ్డి | 253881 |
| జుక్కల్ | 202230 |
| ఎల్లారెడ్డి | 222260 |
| బాన్సువాడ | 196012 |
| మొత్తం | 1635999 |







**జహీరాబాద్ లోకసభ ఎన్నికల్లో గెలిచిన పార్టీలు, అభ్యర్థులు, పొందిన ఓట్లు..**

| సంవత్సరం | గెలిచినఅభ్యర్థి | పొందిన ఓట్లు | ఓడినఅభ్యర్థి | పొందిన ఓట్లు | గెలిచిన పార్టీ |
|---|---|---|---|---|---|
| 2009 | సురేష్ షేట్కర్ | 395767 | యూసూఫ్ అలీ | 378360 | కాంగ్రెస్ |
| 2014 | బీబీ పాటిల్ | 508661 | సురేష్ షేట్కర్ | 304030 | టీఆర్ఎస్ |
| 2019 | బీబీ పాటిల్ | 434244 | మదన్‌మోహన్‌రావు | 428015 | టీఆర్ఎస్ |

# కాంగ్రెస్, బీజేపీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

**మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి**

నవతెలంగాణ-జోగిపేట



కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అందోల్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు మూడు లక్షల కోట్లు కావాలని.. ఎక్కడికెళ్లి తీసుకొస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుందన్నారు. పదవులు, అధికారం, వ్యాపారాల కోసం వచ్చిన స్వార్థపరులు, మోసకారులే పార్టీ మారుతున్నారని ఆరోపించారు. బిబీ పాటిల్ పెద్ద మోసకారి అన్నారు. మొదటి నుంచి గులాబీ జెండా మోసిన కార్యకర్తలు, నాయకులు పార్టీలో ఉన్నారన్నారు. కేంద్రంలో బీజేపీ 10 ఏండ్లు అధికారంలో ఉండి ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. పార్లమెంట్ ఎన్ని కల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు దిమ్మ తిరిగేలా ఓట్లు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించుకో వాలన్నారు. గ్రామాల్లో కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. గాలి అనిల్ కుమార్ విజయానికి ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయా లన్నారు. అనిల్ కుమార్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతానికి రైల్వే లైన్ తీసు కొస్తామన్నారు. అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ పిడికెడు మందితో ఉద్యమం ప్రారం భించి తెలంగాణ సాధించారన్నారు. మన యాస, భాష, మన కష్టనష్టాలు పార్లమెంట్ లో వినిపిస్తానన్నారు. పార్ల మెంటలో మీ గొంతుకగా నిలుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మెన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, అందోల్, మునిపల్లి జెడ్పీటీసీ రమేష్, మీనాక్షి సాయి కుమార్, ఎంపీపీ జోగు బాలయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మెన్‌లు నారాయణ, డి.బి.నాగభూషణం, పల్లె సంజీవయ్య, రజనీకాంత్, మాజీ ఎంపీపీ రామ గౌడ్, మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్, పార్టీ పట్టణాధ్యక్షుడు సార శ్రీధర్, నాయకులు చాపల వెంకటేశం, బిర్లా శంకర్, మహేష్ యాదవ్, నాగరత్నం గౌడ్, నాయి కోటి అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మొగ్దుంపల్లి గ్రామంలో ముస్లిం సోదరులు శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి.. ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని బుదేరా చౌరస్తాలోగల మర్కజ్ మజీద్‌లో మాజీ ఎంపీటీసీ మనోహర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ముస్లిం మత పెద్దలు పాల్గొని ఫలహారాలను తినిపించి ఉపవాస దీక్షలను విరమించారు. అనంతరం మజీద్‌లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి..

- మరో విద్యార్థికి గాయాలు ఆసుపత్రికి తరలింపు

నవతెలంగాణ-పటాన్‌చెరు

ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుకల నుంచి స్కూటీ ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరో విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సీతారామపురం కాలనీకి గిరి ప్రసాద్ రావు కుమారుడు సుదీప్ పట్నాయక్ (15) పట్టణంలోని శాంతినగర్ లో గల మంజీరా హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. పట్టణంలోని శాంతినగర్ చెందిన జస్వంత్ (16) అదే కాలనీలోని గీత హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. కాగా గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత (తెల్లవారితే శుక్రవారం) సుదీప్ పట్నాయక్ తల్లికి పంటి నొప్పి రావడంతో స్కూటీపై తన స్నేహితుడైన జస్వంత్ ఇంటికి వెళ్లి అతని తీసుకొని రోడ్డుపైకి వచ్చాడు. స్కూటీలో పెట్రోలు అయిపోవడంతో లోపం చౌరస్తా తరువాత ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసుకొని తిరిగి పటాన్‌చెరు వైపు వస్తుండగా వాల్యూమ్ జోన్ హైపర్ మార్ట్ దగ్గర జాతీయ రహదారి పై ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనకాల నుంచి స్కూటీ ఢీకొట్టింది. దాంతో స్కూటీ నడుపుతున్న సుదీప్ పట్నాయక్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ వెనకాల కూర్చున్న జస్వంత్ తలకు, కుడి కన్ను, కుడి చెయ్యి ఫ్యాక్చర్ అయింది. సమాచారం అందుతుందా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ జస్వంత్‌ను పట్టణంలోని అమేద ఆసుపత్రికి తరలించి, మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పదో తరగతి పరీక్షలు రాస్తూ చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన అందరిని కంటతడి పెట్టించింది. గిరి ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు

## ప్రజల ప్రయాణానికి అడ్డు

నవతెలంగాణ-గజ్వేల్



అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడు.. ప్రయాణికులు, ప్రజల రాకపోకలకు అడ్డుగా మారింది. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని గజ్వేల్ పట్టణ పాత రింగురోడ్డుగా పేరున్న పీఎస్ఆర్ గార్డెన్ రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోయింది. రూ.68 లక్షల నిధులు మంజూరు కాగా దీన్ని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ఉన్న పాతరింగ్ రోడ్డును పూర్తి చేయాలనే లక్ష్యంతో నిధులు కేటాయించారు. ఆరు మీటర్ల పొడవుతో రోడ్డును వేయడం వల్ల నిధులు సరిపోయే అవకాశం లేదని సంబంధిత కాంట్రాక్టర్ కొంత వరకు ఎన్నికల ముందు పనులు చేసి నిలిపివేశారు. ప్రస్తుతం కేటాయించిన నిధుల ద్వారా పనులు పూర్తయ్యే అవకాశం లేదని సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు. పిఎస్ఆర్ గార్డెన్ నుంచి వైష్ణవి గార్డెన్ వరకు రోడ్డు పనులు పూర్తయినప్పటికీ మరికొంత పనులు మిగిలిన నిధులతో చేసే అవకాశం ఉంది. అక్కడినుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు రోడ్డును పూర్తి చేయాలంటే మరిన్ని నిధులు అవసరం ఉంటుందని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. 300 మీటర్ల పైగా రోడ్డు పూర్తిగా గాక ప్రస్తుతం మిగిలిన నిధులతో మరో రెండు వందల మీటర్ల రోడ్డు పూర్తయే అవకాశం ఉంది. ఈ రోడ్డు పిఎస్ఆర్ గార్డెన్ నుండి ఎన్టీఆర్ విగ్రహం సమీపం వరకు సుమారు 1200 మీటర్ల రోడ్డు ఉన్నది. మిగిలి ఉన్న నిధులతో రోడ్డు పూర్తి చేస్తే మరో 600 పైగా మీటర్ల రోడ్డు మిగిలి ఉంటుందని అధికారులు అంటున్నారు. కోటి రూపాయల వరకు విధులు అవసరం ఉంటుందని అంచనా వేస్తున్నారు. 20 ఫీట్ల వెడల్పుతో ఆరు ఇంచుల ఎత్తుతో ఈ రోడ్డును విస్తరిస్తున్నారు. పీఎస్ఆర్ గార్డెన్ నుంచి 300 మీటర్ల పైగా రోడ్డు పూర్తయి ఆ తర్వాత ఉన్న రోడ్డు ప్రజలకు నరకం చూపిస్తుంది. ముందుగా ఈ రోడ్డు విస్తరణ పై సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చిన్నగా రోడ్డును విస్తరించాలని భావించి. రూ 68 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిం ది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అన్ని రోడ్లు 20 ఫీట్ల వెడల్పుతో వేయడం వల్ల ప్రధానంగా పాత రింగ్ రోడ్డు గా పేరున పిఎస్ఆర్, వైష్ణవి గార్డెన్ వైపు రోడ్డు వెడల్పు 20 ఫీట్లగా వేయాలనే తిరిగి ఆలోచన చేయడం వల్ల నిధులు సరిపోలేదు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ అధికారులు తిరిగి రోడ్డుకు కావాల్సిన నిధులను మంజూరు చేయాలి. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు 16,17 వార్డు ప్రజలకు సంబంధించిన రోడే కాకుండా పట్టణ నలుమూలల నుండి ప్రజ్ఞాపూర్ కు వెళ్లే ప్రజలు ఈ రోడ్డు వెంబడి వెళ్తుతున్నారు. ముట్రాజ్ పల్లి, మల్లన్న సాగర్, సంగాపూర్ ప్రజలు సైతం అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్లకుండా పిఎస్ఆర్ గార్డెన్ గుండా ఎన్టీఆర్ విగ్రహం నుండి వెళ్లిపోతున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం లోనే ఈ రోడ్డును ప్రతిపాదించి పిఎస్ఆర్ గార్డెన్ నుండి వయా ఎన్టీఆర్ విగ్రహం, రాజిరెడ్డిపల్లి, రాజీవ్ పార్క్ మీదుగా కోట మైసమ్మ వరకు ఈ రోడ్డును రింగ్ రోడ్డుగా అప్పటి ఎమ్మెల్యే నర్సారెడ్డి ప్రతిపాదించి వేయించారు. ఆ తర్వాత ఈ రోడ్డు విషయంలో పదేండ్లు ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించలేకపోయింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ రోడ్డుకు మళ్ళీ మోక్షం వస్తుందని ప్రజలు భావిస్తున్నారు. కోటి రూపాయలు నిధులు మంజూరు చేసి ఈ రోడ్డును పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. 800 మీటర్ల రోడ్డు పూర్తిగా కంకర దీని గుంతలు ఉండటం వల్ల స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాల దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ శాఖ అధికారులు ఇప్పటివరకు ఈ రోడ్డును పరిశీలిం చలేకపోయారు. గతంలోనే మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పిఎస్ఆర్ గార్డెన్ రోడ్డును పరిశీలించాలని మున్సిపల్ శాఖ అధికారులు దృష్టికి తీసుకు పోయిన ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. నిధులు మంజూరు చేసి రోడ్డుని పూర్తి చేయవలసిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఈ రోడ్డును పరిశీలించి నిధులు మంజూరు ప్రతిపాదన చేయాలని కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
శనివారం | 30 మార్చి 2024 | www.navatelangana.com

## కాటన్ బిగ్ బజార్ ప్రారంభం



**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

నారాయణఖేడ్ పట్టణం లోని హనుమాన్ కాలనీ వద్ద కాటన్ బిగ్ బజార్‌ను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు ఎక్కువ రేటు కాకుండా తక్కువ రేటుకు కాటన్ బట్టలు ఇవ్వాలన్నారు. బిగ్ బజార్ షాపు అందరూ వినియోగించుకోవాలని అన్నారు. కాటన్ బిగ్ బజార్ యజమాని ఎమ్మెల్యేకు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆదినారాయణ స్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి



**నవతెలంగాణ-జిన్నారం**

మండల పరిధిలోని కొడకంచి గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేతంగా కొలువుదీరి కంచి పుణ్యక్షేత్రం స్థాయిని సంతరించుకున్న ఆదినారాయణ స్వామి ఆలయాన్ని జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణ స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఫౌండర్ ట్రస్ట్ చైర్మెన్ రామోజీరావు, అర్చకులు, మాజీ సర్పంచులు శెట్టి శివరాజ్, శ్రీశైలం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్జి ప్రభాకర్ రావు ను ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మెన్ రామోజీరావు బృందం శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయరావు సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నోరూరిస్తున్న హరీస్, హలీం

- రంజాన్ అంటేనే గుర్తుకొచ్చేవి ఈ వంటకాలే..
- కులమతాలకు అతీతంగా ఇష్టపడే ఫుడ్
- జహీరాబాద్ నుంచి కర్ణాటక, మహారాష్ట్రకు ఎగుమతి







**నవతెలంగాణ-జహీరాబాద్**

రంజాన్ వచ్చిందంటే చాలు ప్రతి ఒక్కరి నోట హరీస్, హలీం అనే వంటకాల పేర్లే వినబడుతుంటాయి. కులమతాలకు అతీతంగా చాలామంది ఇష్టంగా ఈ వంటకాలను ఆరగిస్తుంటారు. రోడ్డు పక్కన, హోటళ్ల ముందు ప్రత్యేక పొయ్యిలు ఏర్పాటు చేసి.. హరీస్, హలీం, దయివడ లాంటి ప్రత్యేక వంటకాలను చేయడం రంజాన్ మాసంలో మాత్రమే చూస్తుంటాము. ఎంతోమంది ఈ వంటకాలను తినడానికి కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తుంటారు.

రంజాన్ మాజాన్ మాసంలో ప్రత్యకమైన వంటకాలతో పాటు పిండి వంటలకు ఎక్కువ ప్రధాన్యతనిస్తారు. అందులో ప్రధానంగా హలీం, హరీస్, దయివడ పేరొందాయి. తయారీకి ప్రత్యేక పొయ్యిల తో పాటు వంట సామాగ్రిని కూడా ప్రత్యేకంగా సమకూర్చుకుంటారు. ప్రదానంగా హరీస్ తయారీలో మాంసంతో పాటు సుగంద ద్రవ్యలైన దాల్చిన చెక్క, ఖాజు, బాదం, ఖర్బుజా, తర్బుజా, అక్రోట్ విత్తనాలతో పాటు గోధుమ రవ్వ, నేయ్యి, ఇలాచీలు, మిరి యాలు, లవంగాలను వాడతారు. దాంతో ఈ వంటకం తయారవుతున్న సమయంల చుట్టు ప్రక్కల ప్రాతాలన్నీ ఘుమఘుమలాడుతాయి. అందుకు తగ్గట్టుగానే ఆ రుచి కూడా ఉంటుంది. అంతేకాకుండా ఇవి తినగానే శరీరానికి వెం టనే శక్తినిస్తుంది. కాబట్టి రంజాన్ ఉపవాసాలు విడిచిన వెంటనే చాలమంది ఈ హరీస్, హలీంను తినడానికి ఇష్టపడుతారు.

**హరీస్, హలీంలో ఎన్నో రకాలు..**

హరీస్, హలీంలో ఎన్నో రకాలు ఉన్నాయి. అంతే కాకుండా నేడు షుగర్ ఫ్రీ హరీస్ కూడా తయారు చేస్తున్నారు. చికెన్, వెజిటేబుల్ హరీస్‌లు ఎప్పటినుంచో ఉన్నాయి. కాగా వీటి ధర కొంచెం ఎక్కువగా ఉండడంతో ప్రజలు తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. అయితే జహీరాబాద్‌లో సుమారు 20 హరీస్ దుకాణములు వెలిశాయి.

**అందంగా అలంకరణ..**

హరీస్ దుకాణాలను రకరకాల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ప్రతీరోజు పువులతో అలంకరించి వినియోగ దారులను ఆకర్శిచేంచేలా దుకాణదారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**నిరుపేదలకు దయివడలే హరీస్..**

నిరుపేదలు, హరీస్ కోనేందుకు సామర్థ్యం లేనివారు పెరుగు, పిండితో తయారు చేసిన దయివడలతోనే సరి పెట్టుకుంటారు. వాటిధర కేవలం ప్లేటుకు రూ.15 నుంచి 30 మాత్రమే ఉంటుంది. దాంతో నిరుపేదలు పెద్దమొత్తంలో వాటిని కోనుగోలు చేస్తారు. కాగా ఒకపొద్దు విడిచిన తర్వాత దయివడలు తింటే కడుపులో ఏ విదమైన ఇబ్బందులు రావని వైద్యులు కూడా సూచిస్తున్నారు.

> జహీరాబాద్‌లో తయారైన హరీస్, హలీంలను కర్ణాటక, మహారాష్ట్రలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. అక్కడి వారు
>
> **జహీరాబాద్ నుంచి ఎగుమతి..**
>
> కూడా ఈ వంటకాలను ఎంతోఇష్టంగా తింటారు. దాంతో జహీరాబాద్ నుంచి ప్రత్యక వాహనాలను ఏర్పాటు చేసి అందులో తరలిస్తారు.



## 'రఘునందన్ నోరు జాగ్రత్త'

**నవతెలంగాణ-సంగారెడ్డి**

'రఘునందన్ నోరు జాగ్రత్త.. దుబ్బాక ప్రజలు నిన్ను ఛీ కొట్టిన బుద్ధి రాలేదు' అంటూ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నరహరిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రఘునందన్ రావు భాష మార్చుకోవాలని, నైతిక విలువలు లేని వ్యక్తి రఘునందన్ రావు దుయ్యబట్టారు. ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని అక్రవాలకు పాల్పడిన వ్యక్తి రఘునందన్ అని ఆరోపించారు. అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు చేసి రఘునందన్ పైకి వచ్చారన్నారు. బీజేపీలో సీనియర్ నాయకులు ఉండగా రఘునందన్‌కు ఎందుకు టిక్కెట్ ఇచ్చారని ప్రశ్నించారు. రఘునందన్ రావు డబ్బులు పెట్టి టికెట్టు తెచ్చుకున్నారని ఆరోపించారు. అందుకే ఆ ఫ్రస్టేషన్లో రఘునందన్ రావు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియట్లేదన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డిలపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో విజేందర్ రెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



## ఐడీఏ బొల్లారంలో బస్టాండ్‌ను వెంటనే నిర్మించాలి

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

ఐడీఏ బొల్లారంలో వెంటనే బస్టాండ్ నిర్మించాలని, అన్ని బస్ స్టాప్‌లలో బస్సు షెల్టర్‌లను నిర్మించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య మాట్లాడుతూ..ఐడీఏ బొల్లారంలో బస్టాండ్, బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బస్టాండ్ నిర్మించాలని, అన్ని బస్‌స్టాప్‌లలో షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఐడీఏ బొల్లారంలో రోజుకు వేలాది మంది ప్రజలు బస్సుల్లో ప్రయాణిస్తారన్నారు. వేల మంది ఉన్నప్పటికీ కూడా ఇప్పటిదాకా బస్టాండ్ నిర్మించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే బస్టాండ్ నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బొల్లారం నుంచి వివిధ చోట్లకు పోయే దగ్గర ఏ ఒక్క దగ్గర కూడా బస్సు సెంటర్ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబురావు, సురేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పీఎఫ్ క్లెయిమ్స్‌పై గీతమ్‌లో చర్చాగోష్ఠి





**నవతెలంగాణ-పటాన్‌చెరు**

భవిష్య నిధి, క్లెయిమ్ చట్టబద్ధమైన అంశాల పునరావలోకనంపై శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో చర్చాగోష్ఠి జరిగింది. హైదరాబాద్ ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (హెచ్ఐపీఏ) నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎఫ్ క్లెయిమ్, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్స్ కోడ్, 2016 (ఐబీసీ) గురించి సవివరంగా చర్చించి, వాటికి పరిష్కార మార్గాలను చూపారు. పటాన్‌చెరు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-1 విశాల్ అగర్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో, చార్టర్డ్ అకౌంటెంట్, ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్ మల్లికార్జున్ ప్రారంభోపన్యాసం చేశారు. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్ స్సీ కోడ్, 2016 (ఐబీసీ) పథకం గురించి కంపెనీ సెక్రటరీ, ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్ మహదేవ్ తిరునగరి అవగాహన కల్పించారు. ఉద్యోగుల భవిష్యనిధి ప్రభావం గురించి న్యాయవాది, కంపెనీ సెక్రటరీ షేక్ గౌస్ చర్చించారు. పీఎఫ్ క్లెయిమ్‌లపై కేసులు, చట్టాలపై కాస్ట్ అకౌంటెంట్, ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్ ఈఎస్ఎస్ఆర్ మూర్తి అవగాహన కల్పించడమే గాక అందులో ఎదురయ్యే సమస్యల ను ఎలా పరిష్క రించుకోవాలో వివరించారు. సహజంగా ఎదురయ్యే సమస్యలు, చట్టాలుపే ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్, న్యాయవాది హరి ప్రసాద్ అవలోకనాన్ని అందించడం ద్వారా ఈ చర్చాగోష్ఠిని ముగించారు. ఈ చర్చాగోష్ఠిలో హెచ్ఎసీపీఏ సభ్యులు, ఉద్యోగుల భవిష్య నిధి ప్రాంతీయ కార్యాలయం పటాన్‌చెరు, బర్కత్‌పుర, మాదాపూర్, కూకట్ పల్లి అధికారులు పాల్గొన్నారు. వారంతా, ఆచరణాత్మక జ్ఞానం, పలు కేసులు, వాటిని పరిష్కరించే విధానాలు, సీఎఫ్ క్లెయిమ్‌లు వంటి వాటిపై లోతైన అవగాహనను పొందారు. గీతం రెసిడెంట్ డైరక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించడమే గాక, అందులో పాల్గొన్న వారి విజ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించడానికి దోహదపడ్డారు. నేర్చుకోవడం, సహకారం, వృత్తిపరమైన అభివృద్ధికి వేదికగాఈ చర్చాగోష్ఠి ఉపకరించింది.

# నేడు ఖేడ్‌లో బీఆర్ఎస్ సమావేశం



**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

నారాయణఖేడ్ పట్టణంలోని కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నేడు (శనివారం) బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వ హించనున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ శాసన సభాపతి (బాన్సువాడ ఎమ్మెల్యే) పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ హాజరు కానున్నారు. కాబట్టి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, జెడ్పీ టీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్య క్షులు, మున్సిపల్ కౌన్సిలర్, మార్కెట్ కమి టీ చైర్మెన్ మరియు డైరెక్టర్లు, ఆత్మ చైర్మెన్ మరియు డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్, మండల పార్టీ యువ త అధ్యక్షులు, మండల పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఫ్యాక్స్ చైర్మన్లు గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంస్థ అధ్యక్షులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పార్టీ కార్యాలయం పత్రిక ప్రకటనలో తెలిపింది.

# బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



**నవతెలంగాణ-సంగారెడ్డి**

భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 ఏండ్లు గడుస్తున్నా.. పేద ప్రజలకు అనుకూలమైన సంక్షేమ పథకాలను అమలు చేయకుండా బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ పరిశ్రమలకు దోచిపెడుతున్నారని.. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలను సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఐ(ఎం) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సంగారెడ్డి డంపింగ్‌యార్డ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమ పథకాలను రోజురోజుకు విస్మరిస్తూ పెట్టుబడిదారులను కార్పొరేట్ పారిశ్రమలను ప్రోత్సహిస్తున్నారన్నారు. దేశంలోని ధనవంతులు ఇతర దేశాలలో దోచిపెట్టిన నల్లధనాన్ని తీసుకొస్తానని చెప్పి పదేండ్లు కావస్తున్నా. పైసా తీసుకురాలేదని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు రూ.14 లక్షల కోట్లు రాయితీ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్ఠ పరచాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి పదేండ్లు గడుస్తున్నా.. ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ చెప్పినట్టుగా నడుస్తుందని ప్రజల పట్ల ప్రేమ మమకారం లేదన్నారు. హిందూ పేరుతో రాజకీయాలు చేస్తూ మళ్ళీ అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. బీజేపీ మతోన్మాద ఆర్ఎస్ఎస్ రాజకీయాలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు యాదగిరి, నర్సింలు, రాజయ్య మని, రజిత, మల్లమ్మ పద్మమ్మ, సునీత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## నేటి ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**నవతెలంగాణ-సంగారెడ్డి**

నేటి ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. జిల్లా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం కోసం జిల్లా మహాసభలు రాయల్ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్టు చెప్పారు. కాబట్టి విద్యార్థి నాయకత్వం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రజినీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కనిపించకుండా పోయిన వ్యక్తి మృతి

**నవతెలంగాణ-జిన్నారం**

రెండ్రోజుల క్రితం నుంచి కనపడకుండా పోయిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సోలక్పల్లిలో జరిగింది. జిన్నారం ఎస్సై విజయరావు తెలిపిన వివరాల ప్రకారం.. సోలక్‌పల్లికి చెందిన సిరిగిరి గండయ్య(50) ఈనెల 27 నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో అతని తల్లి రాజమ్మ ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేసింది.కాగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం సోలక్‌పల్లి శివారులో సిరిగిరి గండయ్య శవం జేసీబీ తీసిన గుంతల పక్కన లభించినట్టు ఎస్సై తెలిపారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ విజయరావు తెలిపారు.

## నేడు అమీన్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నవతెలంగాణ-అమీన్‌పూర్**

అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ 33/11 నుంచి వచ్చే 11 కె.వి ఫీడర్స్ అత్యవసర నిర్వహణ, కొత్త సర్వీసులు రిలీజింగ్ చేసే మరమ్మతుల నిమిత్తం కోసం నేటి ఉదయం 6:30 గంటల నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకట్రాంరెడ్డి తెలిపారు. 6:30 గంటల నుంచి 7 గంటల వరకు బంధం కొమ్ము ఫీడర్‌లోని బంధంకొమ్ము గ్రామం, ఓడిఎఫ్ కాలనీ, మారుతి హిల్స్, కృష్ణా, బృందావన్ కాలనీ, మైత్రి కాలనీ, లక్ష్మీ హోమ్స్, అదే విధంగా 7:30 నుంచి 8 గంటల వరకు ఆర్ఆర్ హోమ్స్ ఫీడర్ లోని సాయి విల్లాస్ గ్రీన్ విల్లాస్ ఆర్ఆర్ హోమ్స్ ఎస్ఎస్ హోమ్స్, ఒకే పోల్ పై అదే సమయంలో అమీన్పూర్ పీడర్, లక్ష్మీ హోమ్స్ ఫీడర్లోని భరత్ నగర్ కాలనీ అమీన్పూర్ విలేజ్ సాయిరాం ఎన్క్లేవ్, పిఎస్ఆర్ కాలనీ సాయాంబికా కాలనీ లాలా బాయి కాలనీ లక్ష్మీ హోమ్స్ ఎమ్మెస్ హోమ్స్ సత్య కృప త్రిపుర ఎంక్లేవ్ కాలనీ లింగమయ్య కాలనీ భవానిపురం సాయిరాం కాలనీ కేఎస్ఆర్ కాలనీ, తిరిగి 8:30 నుం చి 9 గంటల వరకు వెదిరి పీడర్‌లోని అమీన్పూర్ విలేజ్ (కొంత ప్రాంతం) సాయి రాజేశ్వరి కాలనీ, చక్రపురి కాలనీ ఫైడ్ పార్క్ శ్రీవాణి నగర్ సబ్వే హోమ్స్ ఎంపైర్ విడోస్ ప్రాంతాలలో అరగంట పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టుసూచించారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలన్నారు.

## రాజ్యాంగ రక్షణ కోసమే ఫూలే, అంబేద్కర్ జన జాతరలు

**మనువాద బీజేపీని ఓడిస్తేనే రాజ్యాంగానికి రక్షణ.. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్**



**నవతెలంగాణ-సంగారెడ్డి**

రాజ్యాంగ రక్షణ కోసమే ఫూలే, అంబేద్కర్ జన జాతరలు, బైక్ యాత్రలను చేపడుతున్నామని.. వీటిని జయప్రదం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జన జాతర, బైక్ యాత్రల కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మానిక్ మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలలో జరిగే పూలే అంబేద్కర్ జన జాతరాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత పదేండ్లలో రాజ్యాంగంపై పెద్ద ఎత్తున దాడి జరిగిందన్నారు. మౌలిక సూత్రాలు, ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం లేకుండా చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ రిజర్వేషన్ రద్దుకు పెద్దఎత్తున కుట్రకు పాల్పడిందని.. ఇది సామాజిక న్యాయం గొడ్డలు పెట్టులాంటిదన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం రద్దు చేస్తామని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అంటున్నాయి వాటిని తిప్పికొట్టాలన్నారు. దళితులు గిరిజనులు బలహీనవర్గాలు మహిళలపై దాడులు, దౌర్జన్యాలు అత్యాచారాలు జరుగున్న ప్రధానమంత్రి మోడీ కానీ మంత్రులు కానీ పట్టించుకోనే పరిస్థితి లేదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తేనే రాజ్యాంగ రక్షణ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ సహాయ కార్యదర్శులు ప్రవీణ్ దాస్, నాయకులు దత్తు, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌అండ్‌టీ సౌజన్యంతో నూతన తరగతి గదుల ప్రారంభం



**నవతెలంగాణ-మునిపల్లి**

మండలంలోని లింగంపల్లిలో తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజికి సీఎస్ఆర్‌లో భాగంగా ఎల్ అండ్‌టి ఐడిపియల్ డెక్కన్ టోల్వేస్ వారు నూతనంగా నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను రీజినల్ హెడ్ వినీష్ కుమార్, ప్రాజెక్టు హెడ్ రాజేష్ విచారే శుక్రవారం ప్రారంభించారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎల్‌అండ్‌టీ యాజమాన్యం ముందుకు రావడం పట్ల లింగంపల్లి రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ చైతన్య హర్షం వ్యక్తం చేశారు.ఎల్‌అండ్‌టీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్మికులకు రూ.26 వేల వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి

**సీఐటీయూ ఆధ్వర్యంలో బొంతపల్లి పారిశ్రామికవాడలో కరపత్రాల పంపిణీ**



**నవతెలంగాణ-గుమ్మడిదల**

పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను పరిగణలోకి తీసుకుని.. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.26 వేల కనీస వేతన జీవోను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ న్యూలాండ్ పరిశ్రమ జనరల్ సెక్రటరీ శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడలో కార్మికుల నివాసాల వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకులను పరిగణలోకి తీసుకుని.. కార్మికులకు రూ.26 వేల వేతనాన్ని ఇవ్వాలన్నారు. ఇందుకు సంబ ంధించిన జీవోను వెంటనే అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ ప్రమాద బీమా లాంటి సౌకర్యాలను వెంటనే అమలు చేయాలన్నారు.ఎందరో కార్మికులు పరిశ్రమల్లో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ పరిశ్రమ యాజ మాన్యాలు పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేని పరిశ్రమలపై సంబ ంధిత శాఖ అధికా రులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని పరిశ్ర మల్లో 12 గంటలు పని చేయించుకొని కార్మికులకు పదివేల చొప్పున వేతనం ఇస్తున్నారని.. వెంటనే 12 గంటల పని వేళలను తొలగిస్తూ 8 గంటల పనివేళలు కల్పించాలన్నారు. లేని పక్షాన అట్టి పరిశ్రమల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్ గౌడ్, రవి, నర్సింహాగౌడ్, హుస్సేన్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
3
మెదక్
శనివారం | 30 మార్చి 2024 | www.navatelangana.com

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి



**నవతెలంగాణ-వెల్దుర్తి**

రంజాన్ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని ముస్లిం సోదరులకు పట్టణానికి చెందిన హౌస్‌ల మల్లేశం చారి శుక్రవారం మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముఖ్యఅతిథిగా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపవాస దీక్ష అనంతరం మల్లేశం చారి ఇంట్లో ముస్లింలకు ఇఫ్తార్ విందులు అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, తలారి మల్లేష్ హనుమేష్, జగ్గా శంకరయ్య, పోతిరెడ్డి, నరసింహారెడ్డి, జగ్గ శంకరయ్య , జీతయ్య గారి కృష్ణ, నిరంజన్ రెడ్డి, దుర్గా గౌడ్, ముస్లిం సోదరులు ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



**నవతెలంగాణ- కొల్చారం**

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని దుంపలకుంట చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్లోత్ రామ్ చరణ్ సింగ్ దుంపల కుంటలోని ఓ షాప్ ముందు ఎలక్ట్రిక్ స్కూటికి ఛార్జింగ్ పెట్టాడు. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన ఆయన మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ మంటలు అదుపు కాలేదు. దీంతో మంటలలో స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. ఇటీవల ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినట్లు బాధితుడు రావమ్ చరణ్ తెలిపారు.

# మార్పు.. మంచిదేనా..?

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి పార్టీ వీడడం దేనికి సంకేతం.!
- కాంగ్రెస్‌లో చేరేందుకు సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మదన్ రెడ్డి
- ఇప్పటికే మదన్ రెడ్డి నుంచి ముఖ్య నాయకులకు ఫోన్ కాల్స్
- అయోమయంలో మదన్ రెడ్డి అనుచరవర్గం



**నవతెలంగాణ- కొల్చారం**

పార్టీ మార్పు మంచిదేనా.. మాజీ సీఎం కేసీఆర్‌కు సన్నిహితంగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి పార్టీని వీడడానికి గల కారణాలేంటి.. పదవి కోసమేనా అంతర్గత సమస్యలేమైనా ఉన్నాయా.. అన్న సందేహాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ నియోజకవర్గ రాజకీయాల్లో ఊహించని కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అదే ఊపును కొనసాగించాలని భావిస్తుండగా.. ఎంపీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇలా పార్టీలు గెలుపు అస్త్రశస్త్రాలను రెడీ చేసుకునే పనిలో పడగా.. నేతలు కూడా తమకు కలిసొచ్చే పార్టీల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. శుక్రవారం నర్సాపూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు అనుగుణంగానే శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి హస్తం గూటికి చేరుతారని జిల్లా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మదన్ రెడ్డి తో జరిపిన చర్చలు సఫలమయినట్లే.. ఎట్టకేలకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఏప్రి 6న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ భహిరంగ సభకు రాహుల్ గాంధీ వస్తున్న నేపథ్యంలో ఆయన సమక్షంలో పార్టీ కండువా కప్పుకునే అవకాశం ఉందని స్పష్టమవుతోంది.

### టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం

ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ నుంచి తన రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన మదన్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించిన వెంటనే ఆయనకు సన్నిహితునిగా ఉన్న మదన్ రెడ్డి టీఆర్ఎస్‌లో చేరి తెలంగాణ సెంటిమెంట్‌తో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిత్యం వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి తమకే టికెట్ వస్తుందని ఆశించి నిరాశ చెందిన మదన్ రెడ్డి పార్టీ మారే ఆలోచనలో పడ్డారు. మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లు బుజ్జగించి ఎంపీ టికెట్ తమకే ఇస్తామని నచ్చచెప్పి సర్దుకోచ్చారు. ఆయన స్థానంలో మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డికి అసెంబ్లీ టికెట్ ఇచ్చిన అధిష్టానం 6 వేల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్‌పై విజయం సాధించారు. చివరికి ఎంపీ టికెట్ ఇస్తామన్న అధిష్టానం ఎంపి టిక్కెట్ ఇవ్వకపోవడంతో మరోమారు మదన్ రెడ్డిని నిరాశపరిచింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరి కార్పొరేషన్ పదవి తీసుకోవాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం.



### అయోమయంలో మదన్ రెడ్డి అనుచరవర్గం

గత కొన్నేళ్లుగా బీఆర్ఎస్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే గా కొనసాగిన చిలుముల మదన్ రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో నియోజకవర్గంలో ఆయన అనుచరవర్గం అయోమయంలో పడింది. ఇప్పటికే నియోజకవర్గంలోని ముఖ్య నాయకులకు మదన్ రెడ్డి పార్టీ మారాలని ఫోన్ కాల్స్ చేస్తున్నట్లు తెలిసింది. ఆయనను నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా రాజకీయ జీవితంలో కష్టసుఖాలను ఎదుర్కొంటూ కొనసాగుతున్న ఆయన అనుచరవర్గం ఎటువైపు పోవాలో ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. పార్టీ వీడితే మంచిదా.. వీడకపోతే మంచిదా.. అనే విషయంలో చాలా మంది నాయకులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన వ్యక్తిగతమే చాలా మందిని ఆకర్షించిందని గత పదేళ్ల బీఆర్ఎస్ రాజకీయ జీవితంలో మదన్ రెడ్డితో కలిసినడిసిన అనుబంధాలు ఎన్నో ఉన్నాయని పలువురు గుర్తు చేసుకుంటున్నారు. మదన్ రెడ్డితోపాటు నియోజకవర్గంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌ను వీడనున్నట్లు సమాచారం.

## నీలం మధుకు ఎంపీ టికెట్ ఇవ్వడం హర్షణీయం

**కాంగ్రెస్ జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్**



**నవతెలంగాణ-కౌడిపల్లి**

బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో గత పది సంవత్సరాలుగా బీసీలకు అడుగడుగునా అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడుగు బలహీన వర్గాలకు పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ గెలుపొందిన దేశ ప్రధాని అయిన చరిత్ర మెదక్‌కు ఉందన్నారు. ఇప్పుడు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఇచ్చి బీసీలకు న్యాయం చేసిందన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ స్థానాల్లో బీసీలంతా ఏకమై పార్టీలకతీతంగా నీలం మధుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. గత కొన్ని తరాలుగా బీసీలను అణిచివేసి రాజ్యాధికారాలు ఏలుతున్న వారికి బానిసలు కాకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలు ఓటు ద్వారా అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని చట్టసభల్లోకి పంపాలని ఆయన కోరారు.

## రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రమాదం ఉంది



**నవతెలంగాణ - నిజాంపేట**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రమాదం ఉందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర పోలీట్ బ్యూరో చైర్మన్, మెదక్ జిల్లా ఇన్చార్జి ర్యాకం శ్రీరాములు తెలిపారు. హైదరాబాదులో రాజ్యాంగ రక్షణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశం రాజ్యాంగం ప్రకారం పరిపాలించడం జరుగుతుందని కుల మతాలకతీతంగా అందరూ సమానంగా జీవించే హక్కు రాజ్యాంగంలో కల్పించారన్నారు. బీజేపీ ప్రభుత్వంకు 400 ఎంపీ సీట్లు ఇస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తా అని మోదీ చెప్పడం జరిగిందన్నారు. భావితరాలకు నష్టం జరిగే ప్రమాదం ఉన్నదన్నారు. కావున ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లు అందరు హాజరై రాజ్యాంగ రక్షణ యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే





**భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి**

**నవతెలంగాణ-మెదక్**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రార్థనలు నిర్వహించారు. మెదక్ తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. ప్రిసిబిటర్ ఇంచార్జి, గురువులు శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం అందించారు. మానవాళి కోసం ఏసు ప్రభువు చేసిన కృషి, త్యాగాలను వివరించారు. క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు క్రైస్తవ మార్గంలో నడుస్తున్న వారికి ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలను నేర్పిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ సత్య మార్గాన్ని అలవర్చుకోవాలని, తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఏసుప్రభువు బోధనలను స్మరించుకుంటూ సమాజానికి ఉపయోగకరంగా ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా క్రీస్తు మరణాన్ని గుర్తు చేసుకుంటూ ఆలయ గంటలు మోగించారు. అనంతరం క్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ 40 రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలను విరమించారు. మత గురువులు డేవిడ్ రిచర్డ్, శ్రీనివాస్, జైపాల్, చర్చ్ కమిటి సభ్యులు గంట సంపత్, జాన్ ఫ్రాంక్స్, శాంసన్ సందీప్, సువన్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మునిగిపోతున్న టైటానిక్ షిప్

- తొందరగా అందులోంచి బయటకు రండి
- అబద్దాల పునాదుల మీద పార్టీని ఎన్ని రోజులు కాపాడుతారు
- చరిత్రలో ఒక పార్టీ ఉండే అని చెప్పుకునే పరిస్థితి వస్తది
- హరీష్ రావు నిజ స్వరూపం సిద్దిపేట ప్రజలకు అర్థమవుతుంది
- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు





**నవతెలంగాణ- మెదక్**

బీఆర్ఎస్ మునిగిపోతున్న టైటానిక్ షిప్ లాంటిదని, ఎంత తొందరగా అయితే అంత తొందరగా ఆ పార్టీలో నుంచి బయటకు రావాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు సముద్రంలో మునిగిపోతున్న టైటానిక్ షిప్‌ను కాపాడటం ఎవరి వల్ల కాలేదని, ఇప్పుడు మునిగిపోతున్న బీఆర్ఎస్ పార్టీని ఎవరూ కాపాడే పరిస్థితి లేదని తెలిపారు. చరిత్రలో బీఆర్ఎస్ అనే ఒక పార్టీ ఉండే అని చెప్పుకునే పరిస్థితి వస్తదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చేవెళ్లలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిగా రంజిత్ రెడ్డిని ప్రకటించారని అక్కడ నుంచి మొదలైన పారిపోవడాలు, పార్టీని వీడడాలు, మునిగిన బీఆర్ఎస్ ప్రస్థానం కడియం కావ్య వరకు వచ్చిందని ఎద్దేవా చేశారు. ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించిన తర్వాత పోటీ చేయమని పార్టీని వీడి పారిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఆ పార్టీ నాయకుని మీద విశ్వాసం లేకపోవడం, అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో మనుషులను మనుషులుగా చూడకుండా చేసిన పొరపాట్లు, కుంభకోణాలు వెరసి టైటానిక్ షిప్ లాగా కాలగర్భంలో కలిసిపోతున్నారని తెలిపారు. జై తెలంగాణ అని సర్వం కోల్పోయిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని దెబ్బకొట్టారన్నారు. అవసరానికి వాడుకొని టిస్యూ పేపర్‌లా పడేయడం, మామను మించి అబద్ధాలు ఆడటం హరీష్ రావుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో మొదటి ముద్దాయి హరీష్ అని వెల్లడించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సీనియర్ నాయకులు పంజా విజయ్ కుమార్, నాయిని ప్రసాద్, బెండె వీణ, మల్లేశం, సుభాష్ చంద్ర గౌడ్, నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ-పాపన్నపేట**

మునిగి పోయేపార్టీ బీఆర్ఎస్ అని బీజేపి మెదక్ ఎంపీ అభ్యర్థి రఘు నందన్ రావు అన్నారు. శుక్రవారం పాపన్నపేటలో జరిగిన బీజేపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రోజు రోజుకు ఖాళీ అవుతుందన్నారు. చివరకు కల్వకుంట్ల సభ్యులు మాత్రమే మిగులుతారని చెప్పారు. మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకట్ రాంరెడ్డి మెదక్ జిల్లా కలెక్టర్‌గా పని చేసినప్పుడు కనీసం ప్రజావాణి దరఖాస్తులు కూడా స్వీకరించలేదన్నారు. అలాంటి వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలు ఎలా తీరుస్తాడని ప్రశ్నించారు. ఇపుడు పేద విద్యార్థుల కోసం రూ.100 కోట్లు కెటాయిస్తానని చెపితే ఎవరు నమ్ముతారని అన్నారు. డబ్బుతో రాజకీయాలు ' చేయలేమని, ఓట్లు కొన లేమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి డబ్బులతో ఎంపీలు కావచ్చని కలలు కంటున్నారని ఎద్దెవా చేశారు. మోడీ మరోసారి ప్రధానిగా హాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, అసెంబ్లీ నియోజక వర్గ ఇంఛార్జి పంజా విజయ్ కుమార్, మండల శాఖ అధ్యక్షులు బీకొండ రాములు, నాయకులు సత్యనారాయణ, సంతోష చారి, నరేష్, సుంకరి కిష్టయ్య..దుర్గయ్య, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే పడవ

**రాష్ట్ర నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డి**



**నవతెలంగాణ-కౌడిపల్లి**

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే పడవ అని రాష్ట్ర నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో చిలుముల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని విడిచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు రావడంతో ఆ పార్టీ నాయకులకు మింగుడు పడటం లేదని తెలిపారు. గత పది సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీలో నుంచి 20కి పైగా మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నప్పుడు రాజీనామా చేసి ఎందుకు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు. కేసీఆర్ నిరంకుశ పాలనకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో ప్రతిపక్ష హెూదా కూడా కోల్పోయిందన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీలోకి వస్తుంటే ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు బీఆర్ఎస్ పార్టీపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఎలా వెళ్తారని ప్రశ్నించడం సరికాదన్నారు. అతి త్వరలో బీఆర్ఎస్ నాయకులు అందరూ జైల్లోకెళ్ళి ఊసలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత లిక్కర్స్ స్కాంలో తీహార్ జైల్లో ఉందని గుర్తు చేశారు. గత పది సంవత్సరాల్లో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి కాలేశ్వరం పేరు మీద లక్ష కోట్లు కల్వకుంట్ల ఫ్యామిలీ సంపాదించిందని ఆమె ఆరోపించారు.

## నర్సాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

**సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నర్సాపూర్ మాజీ శాసనసభ్యులు మదన్ రెడ్డి**

**ఫలించని మాజీ మంత్రి హరీష్ రావు బుజ్జగింపు**

**నవ తెలంగాణ-నర్సాపూర్**

నర్సాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగలనుంది. ఆ పార్టీకి చెందిన నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇచ్చిన హామీ మేరకు ఎంపీ టికెట్ కేటాయించకపోవడంతో మనస్థాపానికి గురై కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మదన్ రెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు ఈ నెల 26వ తేదీన కౌడిపల్లిలోని మదన్ రెడ్డి నివాసానికి వచ్చి మదన్ రెడ్డిని బుజ్జగింపు జరిపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. త్వరలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి నర్సాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ మాజీ సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించినట్లు సమాచారం. నర్సాపూర్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఆ సభలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి తన వర్గీయులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీల మధు, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, నాయకులు కరుణాకర్ రెడ్డి, శేష సాయి రెడ్డి తదితరులు ఉన్నారు.

## రామకోటి సంస్థ అధ్వర్యంలో ఘనంగా గోటి తలంబ్రాల కార్యక్రమం



**నవతెలంగాణ-రామాయంపేట :** గజ్వేల్ రామకోటి సంస్థ ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలో శ్రీరామ కోటి భక్త సమాజం సంస్థ నేతృత్వంలో విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రామకోటి రామరాజు చేస్తున్న అధ్యాత్మిక సేవలు అభినందనీయమన్నారు కోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయోజన అధ్యక్షులు అనంత లక్ష్మి, పుట్టి మల్లేశం, వేలూరు రవీందర్, ఎర్రం ముత్యాలు, రమణ, లక్ష్మీ నారాయణ, చంద్రకళ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## కిరణ్ కుమార్ రెడ్డి ఎంపిక పట్ల హర్షం



**నవతెలంగాణ-మద్దూరు :** భువనగిరి పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఎంపిక చేసినందుకు కాంగ్రెస్ పార్టీ మద్దూరు, దూల్మిట్ట ఉమ్మడి మండలాల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ హర్షం ప్రకటించారు. కిరణ్‌కుమార్ రెడ్డి విజయం కోసం కృషి చేయాలన్నారు. కిరణ్‌కుమార్‌కి టికెట్ కేటాయించడం పట్ల కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంచార్జ్ దీపా దాస్ మున్షి, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జనగామ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి





**నవ తెలంగాణ-రాయపోల్**

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం రామారం గ్రామంలో చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామానికి చెందిన విభూది నర్సింలు (42) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. గురువారం రాత్రి 9:00 గంటల సమయంలో రాయపోల్ మండలం రామారం గ్రామంలో మాలకుంటలోనికి చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతూ ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన నర్సింలు తిరిగి రాలేదని ఆచూకీ కోసం బంధువుల ఇండ్లలో చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికారు. చివరికి రామారం మాలకుంట వద్ద చెప్పులు, బట్టలు ఉండడంతో కుంటలో పడిపోయి ఉంటాడని వెతకగా నర్సింలు మృతదేహం లభించింది.ఇట్టి విషయం పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలోపడి విభూది నర్సింలు మృతి చెందాడని మృతుడి సోదరుడు విభూది దుర్గయ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

నవతెలంగాణ
సిద్దిపేట
శనివారం | 30 మార్చి 2024 | www.navatelangana.com

## పాజిటివ్ ఆటిట్యూడ్‌ని తీసుకోవాలి

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుపు లక్ష్మీ



**నవతెలంగాణ-వర్గల్**

మండలకేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో జరుగుతున్న 'బ్యాగ్ లెస్ డే' లో భాగంగా శుక్రవారం రోజున విద్యార్థులు పలు క్రీడలు, కళ రంగాల్లో పాల్గొన్నారు. దీనిలో భాగంగా నృత్యం, గిటార్, పలు సంగీత వాయిద్యాలను వాయించారు. తరువాత వ్యక్తిత్వ వికాస నిపుణురాలు లక్ష్మి విద్యార్థులనుఉద్దేశించి ప్రసంగించారు. జీవితంలో లక్ష్యం ఏర్పరచుకొని ఎలా విజయం సాధించాలి? అనే అంశంపై పలువురి ఆదర్శాహవంతుల జీవితాలను విద్యార్థులకు ఉదహరించారు. పాజిటివ్ ఆటిట్యూడ్‌ని తీసుకోని నెగిటివ్ ఆటిట్యూడ్‌ని వదిలి పెడితేనే జీవితంలో విజయం సాధిస్తామన్నారు. బ్యాగ్ లెస్ డే రెండో రోజు విజవంతంగా జరిగిందని నవోదయ విద్యాలయ ప్రిసిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



**నవతెలంగాణ-దుబ్బాక**

తెలుగుదేశం పార్టీ 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో టీడీపీ శ్రేణులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం టీడీపీ మెదక్ పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆకుల రాములు మాట్లాడుతూ ,తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత టీడీపీ వ్యవస్థాపకులు, స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు దేనని స్పష్టం చేశారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షులు ర్యాకం రవీందర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పెంబర్తి భాస్కర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు జీడిపల్లి లింగం, జిల్లా గీతా కార్మిక నాయకులు దమ్మాగౌని అంజా గౌడ్,దుబ్బాక మున్సిపల్ కార్యనిర్వాహణ సభ్యులు పంజా నగేష్ పలువురు పాల్గొన్నారు.

# మహతి ఆడిటోరియంకు పార్కింగ్ కష్టాలు

- సమీప స్వగృహాల ప్రజలకు ఇబ్బందులు

**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ పట్టణంలో ముత్రాజ్ పల్లి రోడ్డులో నిర్మించిన మహతి ఆడిటోరియంలో నిర్వహించే ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల మూలంగా సమీప గృహాల ప్రజలకు పార్కింగ్ కష్టాలు, ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మహతి ఆడిటోరియంలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు వచ్చే అధికారులు, ప్రజలు, లబ్ధిదారులు వాహనాలు తీసుకువచ్చి ముత్రాజ్పల్లి రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ రోడ్డుపైనే నిలపడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మల్లన్న సాగర్ కాలనీ సమీపంలో ఉండటం వల్ల ఆ రోడ్డు గుండా మల్లన్న సాగర్ నిర్వాసితులు 14 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాకుండా పట్టణ ప్రజలు సమీప కాలనీలో నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. మహతి ఆడిటోరియం నిర్మించినప్పటికీ తగిన పార్కింగ్ లేకపోవడంతో పక్కకు ఉన్న రోడ్లపై వాహనాలు నిలిపి సమావేశాలకు వెళ్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ప్రభుత్వ ఉన్నంత అధికారులు మహతి ఆడిటోరియంలో గజ్వేల్ నియోజకవర్గం సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు స్థానికంగా ఆరిటోరియంలోనే నిర్వహిస్తున్నారు. మహతి ఆడిటోరియంలో పార్కింగ్ స్థలం లేకపోయింది. గతంలో కలెక్టర్‌గా పని చేసిన ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి మహతి ఆడిటోరియం నిర్మాణం జరిగింది. అయితే పక్కకు పాలశీతల కేంద్రంకు మరో చోట స్థలం కేటాయించి నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ కార్యరూపం దాల్చలేకపోయింది. దీంతో మహతి ఆడిటోరియం చుట్టూ ఉన్న చిన్న



చిన్న గల్లులో ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ నిలుపుకొని ప్రభుత్వ, ప్రైవేట్, పెళ్లిళ్ల నిర్వ హణ కూడా నిర్వహిస్తున్నారు. భవనము అందంగా నిర్మించినప్పటికీ తగిన పార్కింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

### పాలశీతల కేంద్రం తరలించాలి

మహతి ఆడిటోరియం మూలంగా ఇండ్లలోకి వెళ్లే స్థానిక నివాస ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయంలో జోక్యం చేసుకొని మహతి ఆడిటోరియం పక్కనున్న పాల శీతల కేంద్రం అక్కడి నుంచి తొలగించి మరోచోట నిర్మించాలని అప్పుడు పార్కింగ్ ఇబ్బందులు ఉండవని స్థానికులు అంటున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ముఖ్య నాయకులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి అక్కడ నుంచి పాలశీతల కేంద్రాన్ని మరోచోట నిర్మించినట్లయితే ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని, దీనిపై స్థానిక మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎన్నికల సన్నాహక సమావేశానికి తరలిన బీఆర్ఎస్ నాయకులు



**నవతెలంగాణ -నంగునూరు**

సిద్దిపేటలోని కొండా మల్లయ్య, కొండా భూదేవి గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి శుక్రవారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నేతలు తరలివెళ్లారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి హాజరైన సమావేశానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్లు, ఎంపీటీసీలు, మండల పార్టీ సీనియర్ నాయకులు, మండల మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, డైరెక్టర్లు, కో -ఆపరేటివ్ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటి సభ్యులు తరలివెళ్లారు.

## బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ



**నవతెలంగాణ-తొగుట**

తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాలతో నిర్వహించిన ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా మంతూరి సత్యనారాయణ న్యాయవాది విజయం సాధించారు. గురువారం సిద్దిపేట బార్ అసోసియేషన్‌లో జరిగిన ఎన్నికల్లో తొగుట మండలం ఎల్.బంజేరుపల్లి గ్రామానికి చెందిన మంతూరు సత్యనారాయణ సిద్దిపేట కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. గత సంవత్సరం 2022-23 ఎన్నికల్లో మొదటిసారి, 2024-25 లో ఎన్నికల్లో సంవత్సరానికిగాను రెండోసారి భారీ మెజారిటీతో గెలుపొందారు. తొగుట మండల పరిధిలోని మారుమూల గ్రామమైన బంజేరుపల్లిలో 1966లో సామాన్య, మధ్యతరగతి వ్యవసాయ కుటుంబానికి చెందిన మంతూరి సత్యమ్మ-లింగయ్య దంపతులకు మూడవ కుమారుడుగా జన్మించారు. వెంకట్రావు పేటలో ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించారు. అనంతరం దుబ్బాక బీసీ హాస్టల్‌లో ఉంటూ దుబ్బాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, సిద్ది పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని పడాల రాం రెడ్డిలా కళాశాలలో లా పట్టా పొందారు. మొదటి నుంచి సమాజ సేవ సంకల్పంతో 1988లో గ్రామంలో భగత్ సింగ్ యువజన సంఘం స్థాపించి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేశారు. 2013లో నూతనంగా ఏర్పడిన బంజేరిపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతన సర్పంచిగా మంతురి శ్రీలత సత్యనారాయణ ఎన్నికయ్యారు. తమ గ్రామానికి చెందిన సత్యనారాయణ న్యాయవాదిగా పలు ఉన్నత పదవులు పొంది యువతకు మార్గదర్శిగా నిలువడం హర్షణీయమని గ్రామ ప్రజలు, అభిమానులు స్వీట్లు పంచు కోని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొంది సమాజ సేవకు చేయూత అందించాలని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## చెరువు పరిసరాలను శుభ్రం చేసిన ఎన్ఎన్ఎస్ వాలంటీర్లు




**నవతెలంగాణ- గజ్వేల్**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 స్పెషల్ క్యాంప్‌లో భాగంగా రెండవ రోజు శనివారం వాలంటీర్లు గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డి పల్లి గ్రామ చెరువు పరిసరాలను, ప్రాథమిక పాఠశాల ఆవరణను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ పల్లె ప్రజలకు చెరువుతో అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. వ్యవసాయం చేయడానికి చెరువు నీరే ప్రధాన ఆధారమని, అలాంటి చెరువులను కలుషితం కాకుండా చూసుకోవాలని హితవు



పలికారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. గణపతి రావు మాట్లాడుతూ చెరువులు పరిశుభ్రంగా ఉంటే మానవాళికి, జంతు సమూహానికి ఎలాంటి వ్యాధులు రావన్నారు. అలాంటి చెరువులలో స్వార్థంతో చెత్తా చెదారం, గృహ వ్యరాలు, రసాయనిక వ్యర్థాలు పారబోసి నీటిని కలుషితం చేయడం మానుకోవాలన్నారు. చెరువు బాగుంటే ఊరు బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుంచు రాజు, సాయి క్రిష్ణ , ఎం.పి.టి.సి బెల్దె క్రిష్ణ, పి.ఎ.సి. ఎస్ చైర్మన్ జేజాల వెంకటేష్ గౌడ్, గ్రామ పెద్దలు సుకేందర్ రెడ్డి, గ్రామస్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సత్కారం



**నవతెలంగాణ-సిద్దిపేట**

బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి, సత్కరించినట్లు కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ న్యాయవాది బైరి ప్రవీణ్ కుమార్ తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో కోర్టు ప్రాంగణంలో హెూరాహెూరీగా జరిగిన న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంతురి సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా కొమురవెల్లి మహేష్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.వి చారి, కోశాధికారి కర్రోళ్ళ బాబు, సాంస్కృతిక కార్యదర్శిగా సిహెచ్ రామకృష్ణలు ఎన్నికైనట్లు తెలిపారు.

## మెదక్ ఎంపిగా నీలం మధు విజయం ఖాయం

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి
- చెరుకు శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఎంపి అభ్యర్థి నీలం మధు
- మద్దతు ఇచ్చిన శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నీలం మధు



**నవతెలంగాణ-తొగుట**

మెదక్ లోకసభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నీలం మధు విజయం ఖాయమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి నీలం మధు దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి తన విజయానికి మద్దతు తెలిపి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీని వాస్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో నీలం మధుకు తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే దుబ్బాక నియోజకవర్గంలో సుమారు రూ. 20 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖల సహకారంతో రాబోయే రోజుల్లో మారిన్ని నిధులు మంజూరు చేయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడి పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, జిల్లా నాయకులు యెన్నం భూపాల్ రెడ్డి, బుస నిరంజన్ రెడ్డి, తాడెం వెంగల్ రావు, నాయకులు నాగరాజు, కళాకారులు బండకాడి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి



**నవతెలంగాణ-కొమురవెల్లి**

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతమని బీజేపీ జనగామ అసెంబ్లీ కోకన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షులు బూర్గోజు నాగరాజులు అన్నారు. బీజేపీ పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం పలు గ్రామలలో పర్యటిస్తూ ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ సిలిండర్ అందిన మహిళలను, కిసాన్ సమ్మాన్ నిధి కింద సంవత్సరానికి రూ 6 వేలు అందుకుంటున్న రైతులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ, బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లాభార్థి సంపర్క్ యోజన మండల కన్వీనర్ దండ్యాల బిక్షపతి రెడ్డి, నాయకులు బచ్చల నరసింహులు, ఘనబోయిన శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు కొయ్యడ మల్లేశం, ఎక్కలదేవి మధు యాదవ్, మండల ఉపాధ్యక్షులు బ్రాహ్మణపల్లి బాబు, ఈగ కనకయ్య మండల కార్యదర్శి ఘనబోయిన విజయ, దళిత మోర్చా మండల అధ్యక్షుడు బచ్చల రాజు, మండల కార్యవర్గ సభ్యురాలు బక్కి మనోజ, బాలనర్సు, మండల లీగల్ సెల్ కన్వీనర్ మెరుగు శరత్ బాబు,సోషల్ మీడియా కన్వీనర్ పుట్ట కనకయ్య, మండల నాయకులు మూటకోడూరు శ్రీనివాస్‌చారి, చల్ల రమణారెడ్డి, తడుకపల్లి కనకయ్య, కొంతం రాజు, బూరుగు కృష్ణ చీకోటి సాయికుమార్ శ్రీరాముల ప్రకాష్ తదితర నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సౌత్ జోన్ సైక్లింగ్ పోటీలకు వెళ్లిన క్రీడాకారులు



**నవతెలంగాణ-సిద్దిపేట**

హైదరాబాదులో ఈ నెల 29 నుంచి 31 మధ్య జరుగు ఉమెన్స్ సౌత్ జోన్ సైకిల్ పోటీలకు సిద్దిపేట క్రీడాకారులు శుక్రవారం తరలి వెళ్లినట్లు ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ కోచ్ సంజీవ్ తెలిపారు. హర్షిత, రవళి, అంకిత, రాజమణి, వర్షిత, అర్చన, శైలిజలు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని జిల్లా క్రీడల అధికారి నాగేందర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాలసాయిరాం, గర్ల్స్ హై స్కూల్ పిడి సుజాత, బాయ్స్ హైస్కూల్ శ్రీనివాస్, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట నరస య్య శ్రీనివాసులు, డాక్టర్ మహేష్‌లు క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు

## ప్రాజెక్టు మా నియోజకవవర్గంలో, నీరు పారేది పక్క నియోజకవర్గాలకు



**నవతెలంగాణ-తొగుట**

ప్రాజెక్టు నిర్మాణం మా నియోజకవర్గంలో, నీరు పారేది పక్క నియోజకవర్గాలకు అని బీజేపీ నాయకులు, చందాపూర్ తాజా మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు యాదవ్ అన్నారు. శుక్రవారం కూడవెల్లి వాగు వద్ద విలేకరులతో మాట్లాడుతూ రెండు, మూడు రోజుల క్రితం కూడవెల్లి వాగులోకి నీరు వస్తుందని ఆశించామన్నారు. కానీ గజ్వేల్ నియోజకవర్గం కోల్గురు పరిసర రైతుల పంట పొలాలకు వచ్చేలా నీటిని విడుదల చేయడం సరి కాదన్నారు. దుబ్బాక నియోజకవర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించు కోవడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గెలుపొంది నాలుగు నెలలు గడుస్తున్న దుబ్బాక రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దుబ్బాక నియోజకవర్గంలో నిర్మాణం చేసిన మల్లన్న సాగర్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, సిరిజిల్లా నియోజకవర్గం వర్గాలకు కాలువల ద్వారా నీరు తరలించుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మించిన దుబ్బాక నియోజకవర్గం, తొగుట మండలానికి నీళ్ల అందించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి 6 గ్రామ పంచాయతీలు, 6 మధిర గ్రామాలు, వేల ఎకరాల పంట భూములు కోల్పోయిన రైతులు, వేల



కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. స్థానిక మండలానికి చెందిన రైతుల పంట భూములకు నీరు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని నియోజక వర్గానికి, తొగుట మండలానికి కూడవెల్లి వాగు నుంచి మొదలుకొని నర్మరం చెరువు వరకు నీరు విడుదలకు కృషి చేయాలని కోరారు. లేనియెడల పంటలు ఎండి రైతులు నష్టపోతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని కూడవెల్లి వాగులోకి వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బెజగామా ఆంజనేయులు, ఎనుముల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా బీజేపీ మండల కమిటీ ఎన్నిక



**నవతెలంగాణ-మర్కుక్ :** భారతీయ జనతా పార్టీ మర్కుక్ నూతన మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాలను అందజేసినట్లు బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, మాజీ అధ్యక్షులు టి.రమేష్ గుప్తలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉపాధ్యక్షులుగా టి. మహేష్ గౌడ్ (పాములపర్తి), ఆర్. కొమురయ్య యాదవ్ (దామం కుంట), కాయిరం కొండ సంతోష్, (మర్కుక్), ప్రధాన కార్యదర్శులుగా జుగురాజు రాజేందర్ సింగ్ , (గంగాపూర్ యూసఫ్ ఖాన్ పల్లి), మాచిరెడ్డి తిరుపతి రెడ్డి (నరసన్నపేట్), కార్యదర్శులుగా కుంట సత్యం (ఎర్రవల్లి), వై.నరేష్ (వర్ధరాజ్ పూర్), జి.చంద్రశేఖర్(చేబర్తి), కిషల్ సింగ్ (గం గాపూర్), యువ మోర్చా అధ్యక్షులుగా పంజా మధు (కర్కపట్ల), మహిళా మోర్చా అధ్యక్షురాలు అచ్చంగారి అండాలు, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా పాండు (గంగాపూర్), ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా ఎన్ వెంకటేష్ (దామరకుంట), గిరిజన మోర్చా అధ్యక్షులు టి. గోపాల్, మైనారిటీ మోర్చా అధ్యక్షులుగా అంగడి సురేష్, బి కుశల్ సింగ్ (గంగాపూర్), బిసి మోర్చా అధ్యక్షులుగా బి. శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ పాలే మహేందర్ (కర్కపట్ల), మొర్సు కిషోర్ రెడ్డి, సోషల్ మీడియా కోకన్వీనర్ (మర్కుక్), కార్యవర్గ సభ్యులు మైసిగారి బాలకష్ణ (మర్కుక్) కే. సాయి (ఎర్రవల్లి),కే అశోక్ (వరదరాజ్ పూర్), కే.మహేందర్ (పాతూరు), సిఎచ్ శ్రీకాంత్,ఎస్ సంజీవరెడ్డి (మర్కుక్), పి శ్రీధర్ (వెంకటాపూ), పి నాగార్జున (గణేష్ పల్లి), ఎస్ కనకరాజు(కాశిరెడ్డి పల్లి), సిఎచ్ నవీన్ రెడ్డి (ఉప్పల గూడెం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

## పూజల హరికృష్ణను కలిసిన నీలం మధు



**నవతెలంగాణ-సిద్దిపేట**

మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థిగా తన ఎంపికలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారని తెలిపారు. తనకి సంపూర్ణ ఆశీస్సులు అందించాలని కోరారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని, మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేస్తామని హామీ ఇచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజికవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయంలో శుభ్రతపై నిర్లక్ష్యం

**సిబ్బంది ఉన్న శుభ్రత లేదు**

**నవ తెలంగాణ- కొమురవెల్లి**




కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. మల్లన్నను దర్శించుకునేందుకు నిత్యం వేలాదిగా భక్తులు వస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో వ్యర్థాలు శుభ్రత లేమీ కనిపిస్తున్నా పట్టించుకునే వారే లేరని పరిసరాలే ప్రశ్నిస్తున్నాయి. నిత్య కళ్యాణం నిర్వహించే ఆలయ ముఖ మండప ప్రధాన ద్వారం పక్క మూలన అపరిశుభ్ర వాతావరణం నెలకొని దుర్వాసన వస్తుంది. మల్లికార్జున స్వామిని దర్శించుకున్న భక్తులు బయటకు వెళ్లే దారిలో తీర్థప్రసాదాల స్వీకరణ అనంతరం చేతులు కడిగేందుకు వాష్ బేసిన్ ఏర్పాటుచేసి సిమెంటుతో ప్లాస్టర్ చేయకుండా వదిలేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నది. కొబ్బరికాయలు కొట్టే స్థలంలో గోడ పగిలి పోయినాపట్టించుకోకుండా వదిలేశారు. ఆలయ ప్రాంగణంలో లిఫ్ట్ పక్కన కరెంట్ ఎర్త్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ గుంతల్లో చెత్త చెదారం పడి వాసన వస్తుంది. లిఫ్ట్ వెనక భాగంలో ఉన్న స్థలంలో భక్తులు వేసిన వ్యర్థాలతో వుంది. స్వామిని స్మరిస్తూ దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఎక్కడ చూసినా వ్యర్థాలు పరిశుభ్రత లోపించడంతో ఆలయ అధికారుల పనితీరు పై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



## బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపు



**నవతెలంగాణ-మర్కుక్ :** పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయ దుందుభి సాధించటం ఖాయమని బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ తెలిపారు. తెలంగాణ ఉద్యమ పార్టీ పార్లమెంటు ఎన్నికలలో విజయం సాధిస్తుందని తెలుపారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసిన ద్రోహులు, వ్యక్తి గతంగా పనిచేసిన నాయకులు, స్వార్థం కోసం వివిధ పార్టీలలో చేరడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం చేయడం జరుగుతుందన్నారు.

## జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వైష్ణవి



**నవతెలంగాణ-సంగారెడ్డి**

జాతీయస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ పోటీలకు సంగారెడ్డి జిల్లా కొల్లూరుకు చెందిన కబడ్డీ క్రీడాకారిణి వైష్ణవి ఎంపికయింది. ఫిబ్రవరి 16 నుండి 19 వరకు సూర్యాపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఏప్రిల్ 1 నుండి 4 వరకు బీహార్‌లో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. జాతీయస్థాయికి ఎంపికైన వైష్ణవిని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్, సి ఐ మహేందర్ రెడ్డి భారత కబడ్డీ టీం కోచ్ శ్రీనివాస్ రెడ్డి పలువురు అభినందించారు. జిల్లా కబడ్డి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి. అనంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## బీజేవైఎం మండల అధ్యక్షుడిగా తాళ్ళపల్లి ప్రవీణ్ గౌడ్



**నవతెలంగాణ-కొండపాక**

కొండపాక మండల బీజేవైఎం అధ్యక్షుడుగా అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్ళపల్లి ప్రవీణ్ గౌడ్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి నియామక పత్రం అందజేశారు. తన మీద నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంగిడి మోహన్ రెడ్డి, కొండపాక మండల అధ్యక్షులు నీలం సత్యం, భారతీయ జనతా పార్టీ యువమోర్చా అధ్యక్షులు నీలం దినేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నాడు.

## పండ్లు తరలిస్తున్న ఆటో బోల్తా



**నవతెలంగాణ-మిరు దొడ్డి**

పండ్లు తరలిస్తున్న ఆటో బోల్తా పడిన ఘటన మిరుదొడ్డి మండలం ధర్మారం శివారు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట నుంచి అరటి , ద్రాక్ష పండ్లను రామాయంపేట వైపు తరలిస్తున్న ఆటో ధర్మారం శివారులో అదుపుతప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ చంద్రంకు తీవ్ర గాయాలయ్యాయి. రూ. లక్ష విలువైన పండ్లు దెబ్బతిన్నాయి. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జెసిబి సహాయంతో బోల్తా పడిన ఆటోను పక్కకు తొలగించారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**నవతెలంగాణ-మర్కుక్**

మండల పరిధిలోని పాముల పర్తి, మర్కుక్, దామరకుంట, పాతూరు, అంగడికిష్టాపూర్, తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఆయా చర్చిలలో క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పాములపర్తిలో ప్రేయర్ పవర్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ బి. ఇస్సాక్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి లోకపాపముల నిమిత్తం యేసుక్రీస్తు కల్వరి సిలువలో బలియాగమయ్యారన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరుల ఎడల ప్రేమ, జాలి, దయ కలిగి ఉండి క్రీస్తు అడుగు జాడలలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయా చర్చిల సంఘ పెద్దలు, యువత, అధిక సంఖ్యలో మహిళలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

## ఆగి ఉన్నకారును ఢీకొట్టిన ఆటో, ఒకరికి గాయాలు





**నవతెలంగాణ-కొండపాక**

కుకునూరు పల్లి కమాన్ వద్ద ఉన్న కారును ఆటో ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసగండ్ల గ్రామానికి చెందిన దండ్ల ఐలయ్య (45) తన ఆటోలో మిట్టపల్లి గ్రామం నుంచి ప్రయాణికులను తీసుకొని గజ్వేల్ వెళ్తుండగా కొమురవెల్లి కమాన్ వద్దకు రాగానే ఒక్కసారి కళ్ళు తిరగడంతో ఆటో పక్కకు అపి వాటర్ తాగి మళ్ళీ కొద్దిసేపటికి అక్కడి నుంచి బయలుదేరి కుకునూర్ పల్లి గ్రామంలోకి రాగానే మళ్ళీ కళ్ళు తిరగటంతో ఆటో అదుపుతప్పి రోడ్డుపక్కన వున్న కారును ఢీ కొట్టింది. దాంతో ఆటో డ్రైవర్ ఐలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాసు చేరుకుని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉపసర్పంచ్ ఎర్రోల్ల రమేష్



**నవతెలంగాణ-కొండపాక**

కొండపాక మండలం సిరిసినగండ్ల మాజీ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల రమేష్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. హైదరాబాదులోని మైనంపల్లి హనుమంతరావు నివాసంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరాడు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజలకు చేర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపాక మండల పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు, నాయకులు తిమ్మారెడ్డిపల్లి వెంకటేశం గౌడ్, మైనారిటీ సెల్ అధ్యక్షులు మహ్మద్ అరిఫ్, గ్రామ అధ్యక్షులు చెంది కరుణాకర్, యూత్ అధ్యక్షులు గవ్వల కనకమల్లు, వేముల బాబు, సముద్రాల భాను, వేముల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



**నవతెలంగాణ-జగదేవపూర్**

జగదేవపూర్ మండలం పీర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మ దేవతల ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవత విగ్రహాలకు జలాధివాస, ధాన్యాదివాస, సాముహిక రుద్రాభిషేకం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పండితులు విఠల్ శర్మ, మాధవవర్మ గ్రామ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చేర్యాల పట్టణ కేంద్రంలో ఘనంగా గుడ్ ఫ్రైడే



**నవతెలంగాణ-చేర్యాల**

చేర్యాల పట్టణ కేంద్రంలోని ఇండియా మిషన్ కాంపౌండ్ (ఐఎంఐ) ఆవరణలో సంఘ కాపరి పి.ప్రభుదాస్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే(శుక్రవారం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి ప్రభుదాసు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే ను ప్రపంచమంతా నిర్వహించుకుంటారని, దేవుడు మానవుల పట్ల ప్రేమ, కనికరము, జాలి, దయ చూపుతారని తెలియజేస్తూ అదేవిధంగా మానవులైన మనము మనం కూడా మానవుల పట్ల ప్రేమ దయ జాలి కనికరం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెన్ని, ప్రకాశం, డేవిడ్, డానియల్, వివిధ గ్రామాల ప్రజలు, సంఘ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

## ఆస్థి పన్ను చెల్లించలేదని శ్రీ చైతన్య పాఠశాలకు తాళం



**నవతెలంగాణ-చేర్యాల**

చేర్యాల పట్టణ పరిధిలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల యొక్క ఆస్తి పన్ను మున్సిపాలిటీకి బకాయి ఉండడం వల్ల మున్సిపల్ సిబ్బంది కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆ పాఠశాల కు తాళం వేశారు. అత్యధిక పన్నులు ఉన్న స్కూల్స్, కాలేజీలు, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, పట్టణంలోని ప్రజలందరూ వారి వారి ఆస్తి పన్నులు ఇంట్రెస్ట్ పై 90% రాయితీ ఈ నెల 31లోపు ఉండడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చేర్యాల పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మేనేజర్ జే ప్రభాకర్, సర్వర్, శ్రీనివాస్, శశి ప్రీతం, గంగాధర్, వెంకటేష్, శ్రవణ్ పాల్గొన్నారు.

## నీలం మధును కలిసిన చెరుకు



**నవతెలంగాణ -దుబ్బాక**

కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఇంచార్జ్ పూజల హరికృష్ణతో కలిసి శుక్రవారం కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ను మర్యాదపూర్వక కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. నీలం మధు గెలుపు కోసం తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. మెదక్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుని కాంగ్రెస్ అధిష్టానానికి బహుమతిగా అందిస్తామన్నారు.

# భయమనేది దుబ్బాక చరిత్రలో లేదు

- కాంగ్రెస్ మెడలు వంచేది బీఆర్ఎస్సే
- ప్రశ్నించే గొంతు వెంకట్రామా రెడ్డిని గెలిపించుకుందాం
- మాజీ మంత్రి హరీష్ రావు





**నవతెలంగాణ-దుబ్బాక**

"దుబ్బాక అంటేనే కరుడుగట్టిన ఉద్యమకారులున్న గడ్డ. తెలంగాణ ఉద్యమంలో ప్రతి పోరాటం దుబ్బాక నుంచే మొదలయ్యేది. పోరాటాలే ఊపిరిగా దుబ్బాక ప్రాంతం యావత్ తెలంగాణకే దిక్సూచిగా నిలిచింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అణచివేతలకు గురిచేసినా ఈ గడ్డ చరిత్రలో భయ పడలేదు. కాంగ్రెస్ మెడలు వంచే సత్తా బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంది. 6 గ్యారంటీలు అమలు కావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి పరిపాటి వెంకట్రామా రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలి" అని మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. కేసీఆర్ సర్కార్ హయాంలో అన్ని అవకాశాలు అనుభవించిన వాళ్లు కష్టకాలంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి పోతున్నారని, ఆకులు రాలిన చెట్టు కొత్తగా చిగురించినట్టే త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ పునర్ వైభవం సాధిస్తుందని నొక్కి చెప్పారు. శుక్రవారం పురపాలిక కేంద్రంలోని రజనీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎంపీ అభ్యర్థి పరిపాటి వెంకట్రామారెడ్డితో కలిసి మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హాజరై మాట్లాడారు. వెంకట్రామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడే దేశంలోని 728 జిల్లాల్లో సిద్దిపేటను మొదటి 10వ స్థానంలో నిలబెట్టారని, ఆయనకు ఎంపీగా అవకాశం కల్పిస్తే మెదక్ ప్రజల ప్రశ్నించే గొంతుకై పార్లమెంట్ నిధులను రాబడతాడని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి 6 గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, మహాలక్ష్మీ పథకం పేరిట మహిళలను మహా మోసం చేశాడని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు దుబ్బాక ప్రజలను మోసం చేసినట్లే సీఎం రేవంత్ సర్కారు సైతం తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు.

**రూ.100 కోట్లతో విద్యానిధి ఏర్పాటు చేస్తా : వెంకట్రామారెడ్డి**

మెదక్ ఎంపీగా తనను గెలిపిస్తే పీవీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.100 కోట్లతో విద్యానిధిని ఏర్పాటు చేసి పేద పిల్లలందరినీ ఉచితంగా చదివిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ, మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి పలువురు మాట్లాడారు. జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ మున్సిపల్ చైర్మన్ గన్నె వనిత భూమి రెడ్డి,వైస్ చైర్ పర్సన్ అధికం సుగుణ బాలకిషన్ గౌడ్, ఎంపీపీ పుష్పలత కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ కడ్తాల రవీందర్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి, సతీష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ షేర్ల కైలాష్, బీఆర్ఎస్ దుబ్బాక, అక్బర్ పేట భూంపల్లి మండలాల అధ్యక్షులు బాణాల శ్రీనివాస్, జీడిపల్లి రవి, మున్సిపల్ కౌన్సిలర్లు, నియోజవర్గ పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, అధ్యక్షులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



- సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ
- కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు సర్పంచులు

**నవతెలంగాణ-సిద్దిపేట**

కాంగ్రెస్ పార్టీ హయాంలోనే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. హైదరాబాదులోని గాంధీభవన్‌లో సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట రూరల్ మండలంలో గల బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ మల్లయ్య, తోర్నాల మాజీ సర్పంచ్ దేవయ్య, రాఘూర్ కు చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొండూరు రాజు, బుస్సాపూర్ ఉపసర్పంచ్ భగవాన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీకి చెందిన తాజా మాజీ సర్పంచ్‌లు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం దొరల చేతుల్లోకి వెళ్లి రాష్ట్రం సర్వనాశనం అయిందన్నారు. మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రం లక్షల కోట్ల అప్పు చేసిందని, అందుకు బాధ్యులైన వారికి కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కాళేశ్వరం పేరుతో మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. పదేళ్ల తర్వాత దొరల చేతుల నుంచి తెలంగాణ విముక్తి అయిందని, స్వరాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం అంజిరెడ్డి, మహేందర్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ జిల్లా 5 వ మహాసభలను విజయవంతం చేయాలి



**నవతెలంగాణ-దుబ్బాక**

ఏప్రిల్ 3,4 తేదీల్లో సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ కోరారు. శుక్రవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ పనిచేస్తుందన్నారు. గతేడాది నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పోరాటాల పైన సమీక్ష నిర్వహించి భవిష్యత్తు పోరాటాలకు నాంది పలకడం కోసమే ఈ మహాసభల్ని నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం వలే విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి వ్యవహారిస్తుందని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సంక్షేమ హాస్టల్లలో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ ఛార్జిలను గత ప్రభుత్వం పెంచుతున్నామని జీఓ ఇచ్చినా కూడా గత ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు కూడా విడుదల చేయడం లేదన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను మూసి వేసి ప్రైవేట్ యూనివర్సిటీలకు ఆజ్యం పోసిందని ఇది ముమ్మాటికీ పేద ప్రజలకు విద్యను దూరం చేయడమేనని ధ్వజమెత్తారు.దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీలను మూసి వేసి ప్రైవేట్‌కు అప్పజెప్పే పనిలో ఉందని విమర్శించారు. రానున్న రోజుల్లో విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధంకావాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్ఎఫ్. జిల్లా ఉపాధ్యక్షుడు సాధిక్ నాయకులు స్వామి, అరవింద్, ప్రశాంత్, నందిని, కావ్య,నవ్య,చందు, రాజిరెడ్డి, నాగరాజు, పాల్గొన్నారు.

## మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

- ఎంపీ అభ్యర్థి నీలం మధును అధిక మెజార్టీతో గెలిపించుకుందాం



**నవతెలంగాణ-మిరుదొడ్డి**

బహుజన నాయకుడు నీలం మధు నాయకత్వంలో మెదక్ జిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిష్టయ్య, సిద్ది భూపతి గౌడ్ అన్నారు. శుక్రవారం దుబ్బాక నియోజకవర్గంలో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మధును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి గ్రామల అభివృద్ధికి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషి మరవలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలన పేద ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్ నాయకులకు బుద్ధి చెప్పడానికి కాంగ్రెస్ జెండాను మెదక్ ఎంపీ అభ్యర్థి ఆధ్వర్యంలో అధిక మెజార్టీ గెలిపించుకుందామన్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఎక్కడ కూడా అందించని స్థితి నెలకొందన్నారు ప్రభుత్వ సంక్షేమాల పేరుతో ఎన్నో నిధులను దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట డివిజన్ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక




- జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్

**నవతెలంగాణ-సిద్దిపేట**

సిద్దిపేట డివిజన్ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నికల్లో నూతన అధ్యక్ష కార్యదర్శులుగా చెప్యాల సంతోష్, కొండం సంజీవ్ కుమార్‌లు ఎన్నికైనట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 1970 కేరళ కేరళ రాష్ట్రం త్రివేంద్రం ప్రాంతంలో డిసెంబర్ 29,30,31 రోజుల్లో ఏర్పడిందన్నారు. ఆ రోజు నుంచి ఇప్పటివరకు నిరంతరం విద్యార్థుల కోసం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని అలుపెరుగని పోరాటాలు ఎస్ఎఫ్ఐ నిర్వహించిందన్నారు. కాస్మోటిక్ , మేస్ ఛార్జీలు పెంచాలని పోరాడుతుందన్నారు. దేశంలో శాస్త్రీయ విద్య కావాలనీ లక్ష్యంగా పెట్టుకొని దానికోసం నిరంతరం పోరాడుతుందన్నారు. గత మహాసభ నుంచి ఇప్పటివరకు అనేక పోరాటాలు నిర్వహించి, ఫలితాలు సాధించిందన్నారు. నూతన కమిటీలో 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కమిటీలో ఉపాధ్యక్షులుగా షారుక్ ఖాన్, అరుణ్, సహకార్యర్శులుగా గ్యార వంశీ, వినోద్, కమిటీ సభ్యులుగా మణికాంత్, తేజ, అభిషేక్, నవదీప్‌తో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ భవిష్యత్తులో అనేక పోరాటం నిర్వహించి, ఫలితాలు సాధించాలని ఆయన కోరారు.

## జీవితంపై విరక్తి చెంది కూలి మృతి



**నవతెలంగాణ-దుబ్బాక**

జీవితంపై విరక్తి చెందిన ఓ కూలి ఇక తను జీవించి వ్యర్థమని ఉరేసుకొని మృతి చెందిన ఘటన దుబ్బాక పురపాలిక పరిధిలోని చేర్వాపూర్ పిట్టల వాడలో గురువారం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిట్టల వాడకు చెందిన కాలియ జయరాం (34) తన భార్య ప్రేమలత తో కలిసి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా తన భార్య మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంట్లోంచి వెళ్లిపోయిందని తీవ్ర మనస్థాపం చెందాడు. దీంతో మద్యం సేవించి తాను ఉంటున్న గుడిసెలో ఓ దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉరి వేసుకునే ముందు తన ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటన స్థలాన్ని సీఐ పీ.శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాకలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి తండ్రి కాలియ గంగారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎల్లు రవీందర్ రెడ్డి కోవర్ట్, అవకాశవాది




**నవతెలంగాణ- దుబ్బాక :** బీఆర్ఎస్ దుబ్బాక మండల సమన్వయకర్త ఎల్లు రవీందర్ రెడ్డి ఓ కోవర్ట్, రాజకీయ అవకాశవాది అని దుబ్బాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంగర రవి అన్నారు. శుక్రవారం దుబ్బాక మండల పరిధిలోని సీఎస్ఆర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఎల్లు రవీందర్ రెడ్డి విచ్చలవిడిగా డబ్బులు పంచి కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఓటమికి బాధ్యుడయ్యాడని ఆరోపించారు. తమ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డిపై అనేక విమర్శలు చేసిన ఎల్లు రవీందర్ రెడ్డికి త్వరలోనే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు ఏసురెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గడిల జనార్దన్ రెడ్డి, దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ ఆకుల భరత్, మండల ఉపాధ్యక్షుడు కడుదురి నరేందర్ రెడ్డి, దుబ్బాక అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉషయ్యా గారి రాజిరెడ్డి, దుబ్బాక మండల జనరల్ సెక్రెటరీలు బాల్ రెడ్డి, సంజీవులు, దుబ్బాక మున్సిపల్ జనరల్ సెక్రెటరీ మంద శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు దాసరం లక్ష్మి, చింతల లక్ష్మి, దుబ్బాక మండల ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మిద్దె ప్రసాద్, కనక రాజు, సత్తు శ్రీనివాస్ రెడ్డి, అనిల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్ట కిషన్ రెడ్డి, తేజ బాయ్, దుర్గయ్య, కర్ధంపల్లి రమేష్ గౌడ్, కిసార శ్రీను, సందిరి బాలకిషన్, కార్తిక్, హర్ష రెడ్డి, బాల్ రాజు, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.

## ఎంపి ఎన్నికలలో కాంగ్రెస్ విజయం తథ్యం



**నవతెలంగాణ-మర్కుక్**

దేశంలో పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలువడం ఖాయమని మర్కుక్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి అన్నారు. శుక్రవారం ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ సోనియమ్మ రుణం తీసుకునే సమయం వచ్చిందన్నారు. 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ కుటుంబ పాలన, ధనార్జనే లక్ష్యంగామ పనిచేస్తూ, ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. గత 10 సంవత్సరాలలో గజ్వేల్ ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు ఒక్కసారి కలవని చేతకాని సీఎం కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అర్హులైన పేద ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నరన్నారు. ధనదాహంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ లు ముందుకు సాగుతున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధితో పాటు గజ్వేల్ అభివృద్ధి ప్రధాతగా పేరు తెచ్చుకున్నారన్నారు. స్వపక్షం విపక్షం అనే తేడా లేకుండా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకున్న గొప్ప మనసున్న మంచి మనిషి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.